నమస్తే తెలంగాణ
నిజామాబాద్

5 | నిజామాబాద్, సోమవారం 29 ఏప్రిల్ 2024 | NIZAMABAD

పోచారాన్ని సన్మానిస్తున్న లబ్ధిదారు కుటుంబం

కేసీఆర్ సహకారంతోనే
పేదల సొంతింటి కల సాకారం

మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

కోటగిరి, ఏప్రిల్ 28: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతోనే పేదల సొంతింటి కల సాకారమైందని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పొతంగల్ మండలం హెగ్డోలి గ్రామంలో గంధపు చంద్రవ్వ సాయిలు నిర్మించుకున్న డబుల్ బెడ్ రూం ఇంటి గృహప్రవేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాసరెడ్డిని లబ్ధిదారు కుటుంబసభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉమా రాంబాబు, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఎజాజ్‌ఖాన్, యాదవ్‌రావు, నగేశ్, శివ, భాస్కర్‌బాబు, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రకటనలకు
అనుమతి తప్పనిసరి

కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, ఏప్రిల్ 28 : ప్రచారంలో భాగంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. అనుమతి పొందకుండా ప్రకటనల ప్రచురణ, ప్రసారం చేసినా ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందికి వస్తుందని తెలిపారు. అనుచరులు చేసిన ఖర్చును కూడా అభ్యర్థి ఖాతాలోనే చూపిస్తామని పేర్కొన్నారు. ఒకవేళ అభ్యర్థి సమ్మతించకుంటే పబ్లిషర్‌పై చర్య తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు, ఇతర ప్రచార మెటీరియల్‌ను ముద్రించేటప్పుడు తప్పనిసరిగా అనుమతి పొందాలని సూచించారు. లౌడ్ స్పీకర్లు, వాహనాలకు కూడా ముందస్తు అనుమతి పొందాలని తెలిపారు. పోలింగ్‌కు రెండు రోజుల ముందు సైలెన్స్ పీరియడ్ చాలా కీలకమని, న్యూస్ రిపోర్టింగ్‌లో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించి ఏదైనా సమాచారం కోసం 1950కు ఫోన్ చేయాలని తెలిపారు.

వసతిగృహంలో
కుళ్లిన కూరగాయలతో భోజనం

రోడ్లపై కూరగాయలు పారబోసి ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 28: జిల్లా కేంద్రంలోని నాందేవ్‌వాడలో ఉన్న ఎస్టీ ప్రభుత్వ వసతి గృహంలో కుళ్లిన కూరగాయలతో వంట చేస్తున్నారని, నాణ్యత లేని భోజనం పెడుతున్నారంటూ విద్యార్థులు ఆదివారం ఆందోళన చేపట్టారు. ధర్నాచౌక్ వద్ద కూరగాయలను రోడ్లపై పారబోసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా భోజనంలో నాణ్యత కొరవడిందన్నారు. కుళ్లిన కూరగాయలతో వంటచేస్తుండడంపై నిర్వాహకులను అడిగితే ఏం చేసుకుంటారో చేసుకోండని చెబుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆందోళన చేపట్టిన విద్యార్థులను పోలీసు అధికారులు సముదాయించి అక్కడి నుంచి పంపించారు.



కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ వద్ద రోడ్‌షోకు హాజరైన మహిళలు

ప్రజలను
కష్టాల్లోకి నెట్టిన కాంగ్రెస్

- అడ్రస్, ఆఫీస్ లేని పసుపు బోర్డు ఎక్కడ అర్వింద్?
- హామీల అమలులో బీజేపీ, హస్తం పార్టీలు విఫలం
- సర్కార్‌ను ప్రశ్నించే బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డిని ఆశీర్వదించండి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి
- వేల్పూర్, కమ్మర్‌పల్లి, మోర్తాడ్, భీమగల్‌లో ఎన్నికల ప్రచారం



భీమ్‌గల్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న వేముల, బాజిరెడ్డి, పక్కన సురేశ్‌రెడ్డి

వేల్పూర్/మోర్తాడ్(కమ్మర్‌పల్లి)/భీమ్‌గల్, ఏప్రిల్ 28 : అధికారంలోకి వచ్చిన ఐదు నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కష్టాలు, కన్నీళ్లే మిగిలాయని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. అడ్రస్, ఆఫీస్ లేని పసుపు బోర్డు ఎక్కడా అని బీజేపీ అభ్యర్థి అర్వింద్‌ను ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ హామీలను అమలుచేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. హామీల అమలు కోసం ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించే బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డిని గెలిపించాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా వేల్పూర్ మండలం పచ్చల నడ్కుడ, కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి, మోర్తాడ్, భీమ్‌గల్ మండల కేంద్రాల్లో బాజిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డితో కలిసి ఆదివారం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. ఐదు రోజుల్లో పసుపు బోర్డు తీసుకొస్తానని మాటిచ్చిన అర్వింద్ కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ తీసుకురాలేదన్నారు. అలాంటి వ్యక్తికి మళ్లీ ఎందుకు ఓటు వేయాలో ఆలోచన చేయాలని సూచించారు. ఇప్పుడు పసుపు బోర్డు సాధించానని చెబుతున్నాడని, బోర్డు ఆఫీస్, మెయిన్ దర్వాజ, ఆయన కుర్చీ ఎక్కడ ఉందో చూపించాలని ప్రశ్నించారు. ఈసారి పసుపు పంట భారీగా సాగు తగ్గడంతోనే ధర పెరిగిందని ఇందులో బీజేపీ ఘనకార్యం ఏమీ లేదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఉండి ఏనాడు ఇక్కడి ప్రాంత ప్రజల మంచీ చెడుకు రాలేదన్నారు. ఐదేండ్లుగా ఎంపీగా ఉన్న అర్వింద్ అభివృద్ధి పనుల కోసం ఏ గ్రామానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు.

అభివృద్ధి పనులను అడ్డుకునే యత్నం

అసెంబ్లీ ఎన్నికలకు ముందు అభివృద్ధి పనుల కోసం ఇచ్చిన ప్రొసీడింగ్ కాపీలన్నీ బోగసని, ఓట్ల కోసం ఇచ్చినవని, అవి పనులు చేపట్టడానికి కాదు టూ కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ కాపీలను కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి చూపిద్దామన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఆమోదం పొందినవి కాదని కలెక్టర్ చెబితే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, నిజమైనవని తేలితే పనులు జరిగేలా చూడాలని సవాల్ విసిరారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులను నిలిపివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు తెలిసిందని, మంజూరైన పనులను జరగకుండా చూస్తున్న కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో నిలదీయాలని పిలుపునిచ్చారు. మోచేతికి బెల్లం పెడుతున్న కాంగ్రెస్, బీజేపీలను నమ్మవద్దని, మరోసారి మోసపోతే గోస పడక తప్పదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈరెండు పార్టీలకు ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలని కోరారు. బాజిరెడ్డి 40 ఏండ్లుగా రాజకీయాల్లో ఉన్నారని, ఎప్పుడు ఎవరికి ఏ అవసరం వచ్చినా ఆదుకుంటారని అన్నారు.

తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలబెడదాం..

రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి

రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ తెలంగాణను సాధించడమే కాకుండా పదేండ్లలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాడని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే తెలంగాణ ఆత్మగౌరవాన్ని మంటగలుపుతుందని మండిపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవం నిలబడాలంటే కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ఓడించి, బాజిరెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.

ప్రొసీడింగ్ కాపీలను చూపిస్తూ మాట్లాడుతున్న వేముల

బీజేపీ, కాంగ్రెస్ నాయకులను నిలదీయండి

బాజిరెడ్డి గోవర్ధన్

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మాయమాటలు చెప్పి గద్దెనెక్కిందని బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మళ్లీ అబద్ధాలు చెప్పడానికి కాంగ్రెస్, బీజేపీ నాయకులు గ్రామాలకు వస్తున్నారని, వారిచ్చిన హామీలపై నిలదీయాలని పిలుపునిచ్చారు. రూ.4వేల పింఛన్, రుణమాఫీ, తులం బంగారం, సీఎంఆర్ఎఫ్, రైతుబంధు పథకాల అమలుపై ఎక్కడికక్కడ నిలదీస్తే సమాధానం చెప్పలేక పారిపోతారన్నారు. అబద్ధాలు చెప్పే విషయంలో మోదీ బడా ఝూటా.. అర్వింద్ చోటా ఝూటా అని, రేవంత్‌రెడ్డి కేడీ అని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కసారైనా జై తెలంగాణ అన్నాడా ...అనడు ఎందుకంటే తెలంగాణ ద్రోహి అని అన్నారు. తనను గెలిపిస్తే కేంద్రంతో కొట్లాడి పసుపుబోర్డు తీసుకువస్తానన్నారు. ప్రచారంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు

"ఐఐటి – మెడికల్ లో మంచి % టైల్ & ఆల్ ఇండియా ర్యాంకులు సాధించకుండా కేవలం ఇంటర్‌లో మాత్రమే రాష్ట్ర స్థాయి టాప్ మార్కులు వచ్చినా ప్రయోజనం లేదు."

ఇదే NZB. కాకతీయ లక్ష్యం – అది NZB. కాకతీయ తోనే సాధ్యం

పేరు	2024 లో ఐఐటి మెయిన్స్ %టైల్	2024 ఇంటర్ మార్కులు	2024 ఐఐటి మెయిన్స్ ఆల్ ఇండియా ర్యాంక్	2021-2022లో చదివిన స్కూల్ పేరు	2023-2024లో ఇంటర్ కాలేజ్ పేరు
ఎం.డి మీనాజ్	99.68%	934	1051	KOS NZB	కాకతీయ కాలేజ్
ఎం.సుప్రీత్	99.41%	965	2092	KOS NZB	కాకతీయ కాలేజ్
శివప్రతం	99.22%	987	2910	KOS NZB	కాకతీయ కాలేజ్
ఎ.మాలిక్	98.30%	974	7167	KOS NZB	కాకతీయ కాలేజ్
ఎ.హాది	98.22 %	958	7533	KOS NZB	కాకతీయ కాలేజ్

ఇలా 2024 ఐఐటి – జెఈఈ మెయిన్స్‌లో తహమి 94.51%, లోకేశ్ 93.34%, కౌశల్ 91.05% టైల్ సాధించారు. పై విద్యార్థులందరూ స్కూల్ స్థాయిలో కాకతీయ ఒలంపియాడ్ స్కూల్లో నిజమైన ఐఐటి/మెడికల్ ఫౌండేషన్ విత్ ఓలంపియాడ్ ఎడ్యుకేషన్ చదివి తర్వాత ఇంటర్ మీడియట్ కాకతీయ కాలేజి నిజామాబాద్‌లో చదివారు అని తెలియజేస్తున్నాము. పై కాకతీయ స్కూల్ కాలేజీ విద్యార్థులు ఇంటర్‌తో పాటు తొలి ప్రయత్నంలోనే వివిధ కేటగిరీలలో 2024 ఐఐటి/ జెఈఈ మెయిన్స్‌లో ఆల్‌ఇండియా ర్యాంకులు సాధించారని తల్లిదండ్రులకు, విద్యార్థులకు తెలియజేస్తున్నాము. ఇలా 2024 ఐఐటి/జెఈఈ మెయిన్స్‌లో 90% టైల్‌కు పైగా 17 మంది కాకతీయ విద్యార్థులు సాధించడమే కాకుండా 50 మంది ఆల్‌ఇండియా ర్యాంకులు సాధించారని కాకతీయ విద్యాసంస్థ తెలియజేస్తూ... తల్లిదండ్రులను, విద్యార్థును అభినందిస్తున్నాము.

కాంగ్రెస్‌లో కలకలం



వలసొచ్చిన నేతలపై ఆగ్రహావేశాలు

రంగు మారినా..తీరు మారలే..

- పాత, కొత్త నేతల మధ్య అంతర్యుద్ధం
- చందూర్ ఘటనతో పరిస్థితులు బహిర్గతం
- ఎస్టీ జడ్పీటీసీని అవమానించిన మాజీ ఎమ్మెల్యే
- అంబర్ సింగ్‌కు అండగా నిలవని పీసీసీ నాయకత్వం
- కొరకరాని కొయ్యలా మాజీ ప్రజాప్రతినిధుల వ్యవహారం

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో అంతర్యుద్ధం మొదలైంది. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారు పెత్తనం చెలాయించడం పాత నాయకత్వానికి మింగుడుపడడంలేదు. ఉమ్మడి జిల్లాలో ఆ పార్టీలో అసంతృప్తి జ్వాలలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వలస వచ్చిన నేతల తీరుపై పాత నాయకత్వం పెద్ద ఎత్తున దుమ్మెత్తి పోస్తోంది. కష్టాలు, నష్టాలను భరించి పార్టీని నమ్ముకుని ఉన్న నేతలను కాదని, ఇతర పార్టీల వారిని చేర్చుకోవడంపై అడుగడుగునా ఆటంకాలు తలెత్తుతున్నాయి. పీసీసీ ఆదేశాలను సైతం ధిక్కరిస్తూ బహిరంగంగానే గొడవలకు దిగుతున్నారు. తాజాగా(ఏప్రిల్ 27న) చందూర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, జడ్పీటీసీ అంబర్ సింగ్ మధ్య జరిగిన ఘర్షణ ఇందుకు తార్కాణంగా నిలుస్తోంది. ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఇతర పార్టీలకు వెళ్లకుండా పని చేస్తున్న జడ్పీటీసీ అంబర్ సింగ్‌ను ఏనుగు రవీందర్ రెడ్డి, ఆయన అనుచరులు నోటికొచ్చినట్లు మాట్లాడడం తీవ్ర దుమారం రేపుతున్నది. గిరిజన జడ్పీటీసీ కావడంతోపాటు పార్టీలో ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడిన నాయకుడిని అగౌరవపర్చడంపై వివాదం చెలరేగుతోంది. నిన్నగాక మొన్న కాంగ్రెస్‌లో చేరిన వారే పెత్తనం చెలాయించడాన్ని పాత నేతలంతా జీర్ణించుకోలేక పోతున్నారు. తమకు కనీస మర్యాద ఇవ్వకపోవడం ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు. గిరిజన నాయకుడికి అండగా నిలబడకపోగా ఈ వ్యవహారంపై పీసీసీ పెద్దలు స్పందించకపోవడంతో హస్తం శ్రేణులు రగిలి పోతున్నారు.

–నిజామాబాద్, ఏప్రిల్ 28, (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

అవకాశవాదానికి చోటు

2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఓ మాజీ మహిళా ప్రజాప్రతినిధి ఆకస్మాత్తుగా పోటీ నుంచి తప్పుకున్నారు. తర్వాత తన అవకాశవాద రాజకీయం కోసం పార్టీ మారారు. 2023లో బీఆర్ఎస్‌లో చోటు లేకపోవడం, సీటు దక్కకపోవడంతో అప్పటి వరకు విధేయతను ప్రదర్శించినట్లు నటించిన సదరు నాయకుడు ఏకంగా గంటల వ్యవధిలోనే కండువా మార్చేశారు. ఇప్పుడు హస్తం అధికారంలో ఉండడంతో మాజీ ఎమ్మెల్యే తీరుపై పాత నాయకత్వం గుర్రుగా ఉన్నట్లు సమాచారం. కష్ట కాలంలో పార్టీని వదిలి వెళ్లి, అవకాశాల కోసం కాంగ్రెస్‌లోకి వచ్చిన సదరు నేత చేస్తున్న హడావుడిని తట్టుకోలేక పోతున్నారు. ఎమ్మెల్సీ లేదంటే కార్పొరేషన్ పదవిని ఆశిస్తూ పీసీసీ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నం కావడంపై అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారితో తమకు దక్కాల్సిన అవకాశాలు రాకుండా పోతాయా? అనే భయంలో పాత వారు కొట్టుమిట్టాడుతున్నారు. వైఎస్ హయాం నుంచి ఎమ్మెల్సీగా కొనసాగిన ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నీడను వెతుక్కునే మరో లీడర్ రాకను కొందరు మైనార్టీ లీడర్లు ఎండగడుతున్నారు. కాంగ్రెస్‌ను కాదని వెళ్లిన మాజీ ఎమ్మెల్సీని తిరిగి చేర్చుకోవడం ఏంటంటూ శ్రమకోర్చిన నేతలంతా ఇప్పుడు గుస్సా అవుతున్నారు. బోధన్, బాన్సువాడ, నిజామాబాద్ రూరల్‌లో కొనసాగుతున్న చేరికలపై సొంత పార్టీలోనే నిరసనలు వెలుగు చూస్తున్నాయి. కామారెడ్డిలోనూ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికలో కొత్తగా వచ్చిన వారికే ప్రాధాన్యం దక్కడంతో మిగిలిన వారంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హడావుడి చేష్టలు, ప్రచార కార్యక్రమాల్లో డబ్బులు వెచ్చిస్తూ హల్‌చల్ చేస్తున్న అవకాశవాదులను పీసీసీ నేతలు గుర్తించి దూరం పెట్టి, కష్టపడ్డ వారికే ప్రాధాన్యం ఇవ్వాలన్న డిమాండ్లు పీసీసీని ఇరుకున పెడుతున్నాయి. లేదంటే తిరుగుబాటు తప్పదంటూ హెచ్చరికలు సైతం సొంత పార్టీలోనే వినిపిస్తున్నాయి.

మొన్నటి వరకు బీఆర్ఎస్‌లో కరుడుగట్టిన కార్యకర్తల్లా నటించి ముఖ్యులను నమ్మించి మోసం చేశారు. ఇప్పుడేకంగా కాంగ్రెస్ గూటికి చేరి అదే స్థాయిలో నటిస్తుండడంతో హస్తంలోని పాత నాయకత్వం ముక్కున వేలేసుకుని ఆశ్చర్యపోతున్నది. ఒకరిద్దరైతే కాంగ్రెస్ చేరి నెల రోజులు కాక ముందే అధికార పార్టీ అండతో వెంచర్లు, వేరే దందాలకు ముహూర్తాలను ఫిక్స్ చేయడం గమనార్హం. రాజకీయ పార్టీల్లో మారుతున్న ఈ దుర్వ్యవస్థను అన్ని రాజకీయ పార్టీలు సునిశితంగా పరిశీలన చేయాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి వారికి చెక్ పెట్టే దిశగా ఆలోచన చేయాలని సామాన్య కార్యకర్తలంతా కోరుతున్నారు. శ్రమ పడిన వారికే అవకాశాలు ఇవ్వాలంటున్నారు. స్వార్థం కోసం కండువాలు మార్చే వారిని నమ్మొద్దంటూ హితవు పలుకుతున్నారు.

గుర్తింపు ఏది?

కాంగ్రెస్ పార్టీలో నువ్వా నేనా అన్నట్లుగా ఆధిపత్య పోరు నడుస్తోంది. పాత కాంగ్రెస్ ముద్రతో తిరిగి హస్తం గూటికి చేరుతున్న నాయకత్వమంతా పదేండ్లుగా ఇతర పార్టీల్లో అధికారాన్ని చెలాయించి ఇప్పుడు మరోసారి అదే దర్పాన్ని ప్రదర్శిస్తూ విమర్శల పాలవుతున్నది. బాన్సువాడలో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి మొదట బీఆర్ఎస్‌లోఎమ్మెల్యేగా ఉన్నారు. రెండో దఫా ప్రభుత్వంలో ఓటమి చెంది ఆ తర్వాత బీజేపీలో చేరారు. 2023 ఎన్నికల ముందర కాంగ్రెస్‌కు వచ్చారు. ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని వదిలి బాన్సువాడకు రావడంతోనే గొడవలు మొదలయ్యాయి. అప్పటివరకు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న కాసుల బాలరాజును కాదని ఏనుగుకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వడంతో మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన వారంతా ఆగ్రహం వ్యక్తంచేశారు. తీరా బాలరాజు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి దవాఖాన పాలయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మాజీ ఎమ్మెల్యే దూకుడు, ఇతర పార్టీల వారిని బలవంతంగా బెదిరించి, పిలిచి కండువాలు కప్పుతుండడంతో పాత నాయకులంతా మండిపడుతున్నారు. తమను సంప్రదించకుండా ఇష్టారీతిన చేరికలను ప్రోత్సహించడంపై నిలదీస్తున్నారు. చందూర్‌లో జడ్పీటీసీ అంబర్ సింగ్ ఐదేండ్లుగా ఒకే ఒక్కడుగా జడ్పీలో కాంగ్రెస్ సభ్యుడిగా కొనసాగుతూ వచ్చారు. హస్తం పార్టీకి విధేయుడిగా ఉన్న ఆయనను కూడా మాజీ ఎమ్మెల్యే కిరికిరి పెట్టడంతో శనివారం జరిగిన సమావేశం రసాభాసగా మారింది. ఎవడ్రా... ఏనుగు రవీందర్ రెడ్డి అంటూ సోషల్ మీడియాలో అంబర్ సింగ్ పోస్టులు పెట్టే స్థాయికి పరిస్థితి చేరింది. ఇలా పాత, కొత్త నాయకుల మధ్య పెడచూపుతున్న వివాదాలు చినికి చినికి గాలి వానలా మారుతున్నాయి.

ప్రొసీడింగ్ కాపీలను చూపిస్తూ మాట్లాడుతున్న వేముల

నేడే నామినేషన్ల
ఉపసంహరణ

తేలనున్న బరిలో నిలిచే అభ్యర్థుల లెక్క..

కంఠేశ్వర్, ఏప్రిల్ 28 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈ నెల 18న మొదలైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ చివరి అంకానికి చేరుకున్నది. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి మొత్తం 42 మంది అభ్యర్థులు 90 నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 26న నిర్వహించిన స్క్రూటినీలో 10 మంది అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించారు. నేడు (సోమవారం) నామినేషన్ల ఉపసంహరణకు చివరితేదీ కావడంతో ఎంతమంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకుంటారో, ఎంతమంది ఎన్నికల బరిలో నిలుస్తారో తేలనున్నది.